

వందనానికి వంకలా!

కూటమి ప్రభుత్వం తమ పిల్లలకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయకపోవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


8లో



రోడ్డు ప్రమాదంలో ర్యాలి వాసి మృతి

అనకాపల్లి జిల్లా కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్, మహిళ దుర్మరణం పాలయ్యారు.

డెల్టాలకు 10,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

వచ్చే నెల 4న జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ–కాకినాడ 11వ స్నాతకోత్సవం వచ్చే నెల 4న నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా వర్సిటీ చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని, ముఖ్య అతిథి బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రమ్మణ్యానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామని వివరించారు. స్నాతకోత్సవంలో భాగంగా 2023–24కు సంబంధించి బీటెక్ 41,258, బీ–ఫార్మసీ 2,081, ఎంటెక్ 1,659, ఎంబీఏ 3,797, ఎంసీఏ 1,115, ఫార్మా–డి 274, బీఆర్క్ 83, పీహెచ్‌డీ 100, బంగారు పతకాలు 40 ప్రకటించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు మాజీ వీసీలు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు.

30న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ ప్రభాస్ పేపర్ మార్ట్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఎస్‌బీఐ గ్రూప్‌లలో 135 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయన్నారు. పదో తరగతి లేదా ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 86398 46568 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవార్లకు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితుడు ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకులు బాలు, వేణు, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. ఈ హోమంలో 20 మంది భక్తులు రూ.750 టికెట్టుతో పాల్గొన్నారు. కాగా, సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, రత్నగిరి దిగువన తొలి పావంచా వద్ద కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యాన పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి 4న ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాలకు వచ్చే నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.అనంతలక్ష్మి తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, బోటనీ, జువాలజీ, ఆక్వాకల్చర్, మైక్రో బయాలజీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, సంస్కృతం, లైబ్రరీ సైన్స్ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపకులను నియమిస్తున్నామని వివరించారు. కనీసం 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. నెట్, పీహెచ్‌డీ పూర్తి చేసి, డిగ్రీ కళాశాలలో తత్సంబంధిత సబ్జెక్టులో బోధనానుభవం కలిగిన మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

ఎస్‌కేవీటీ కళాశాలలో..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాను వచ్చే నెల 3వ తేదీలోగా అందజేయ్యాలన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు జూలై 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు.

వంచనపై.. జనం బాట

- హామీలు అమలు చేయని కూటమి సర్కారుపై ప్రజల్లోకి వైఎస్సార్ సీపీ
- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పేరిట ప్రచారం
- చంద్రబాబు, పవన్ మోసాలను ఎండగట్టాలని నేతల పిలుపు
- ఐదు వారాల పాటు చైతన్య కార్యక్రమాలు
- త్వరలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు



వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న బొత్స సత్యనారాయణ. వేదికపై పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎన్నికల వేళ అలవి కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పచ్చి దగా చేస్తున్న కూటమి సర్కారు తీరును ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వైఎస్సార్ సీపీ నిర్ణయించింది. చంద్రబాబు అండ్ కో ఎడాపెడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వలన ఏడాది కాలంలో ఏమేరకు నష్టపోయారో ప్రజలకు వివరించనుంది. ఈ మేరకు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' అనే సరికొత్త కార్యక్రమం చేపట్టేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. కూటమి సర్కారు చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు, వారిని చైతన్యపరిచేందుకు ఐదు వారాల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అధ్యక్షతన కాకినాడ సూర్య కళా మందిరంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య నేతలు శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా నలుమూలల నుంచీ పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ సమావేశానికి ఉత్సాహంగా తరలివచ్చారు. తొలుత మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో సమావేశాన్ని ప్రారంభించారు.

చంద్రబాబు మోసాలను ఎండగట్టాలి

సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, మండల, గ్రామ స్థాయిల్లో చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని సూచించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ఎత్తిచూపుతూ ఆయన మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ప్రజల మద్దతు కూడగట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల చిట్టా, జూన్ 24 నుంచి అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కాక మొదటి ఏడాది హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టేయడాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని చెప్పారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనలను తు.చ. తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా మనందరి పైనా ఉందనే విషయాన్ని ప్రజల ముందుంచాలని అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, బీసీలకు పెన్షన్ వంటి అంశాలతో పాటు ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న తీరును వివరించాలని నేతలు పిలుపునిచ్చారు.


అధినేత వైఎస్ జగన్ ఆలోచనలకనుగుణంగా పార్టీ రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రతి కార్యకర్తా తన మొబైల్‌తో ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే టీడీపీ ప్రజాగళం పేరుతో కూటమి మేనిఫెస్టో వస్తుందని, అందులో చంద్రబాబు హామీలు, చేసిన మోసాలు ఉంటాయని వివరించారు. ఈ ప్రచార కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించేందుకు వీలుగా తొలుత పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని బొత్స సూచించారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, తామంతా అండగా ఉంటామని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. సంక్షేమ పథకాలను సంతృప్తకర స్థాయిలో అమలు చేసిన వైఎస్ జగన్ పేరు నేతల ప్రసంగాల్లో ప్రస్తావనకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ జై జగన్ నినాదాలతో సమావేశ ప్రాంగణం మార్మోగిపోయింది.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అనంత బాబు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జ్యోతుల చంటిబాబు, పార్టీ జగ్గంపేట, పెద్దాపురం కో ఆర్డినేటర్లు తోట నరసింహం, దవులూరు దొరబాబు, నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ ప్రసన్న, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్నీ), మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శులు రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా అధ్యక్షురాలు వర్థినీడి సుజాత, పార్టీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, బెహరా రాజరాజేశ్వరి, పార్టీ నేతలు వాసిరెడ్డి జమీలు, తోట రాంజీ, ఉలవకాయల లోవరాజు, యనమల కృష్ణుడు, గుల్లా ఏడుకొండలు, గండేపల్లి బాబీ, అల్లి రాజబాబు, అనసూరి ప్రసాద్, రావూరి వెంకటేశ్వరరావు, శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఒమ్మి రఘురామ్, నాగం గంగబాబు, రోకళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణులతో కిక్కిరిసిపోయిన కాకినాడ సూర్య కళా మందిరం

కూటమి బాండ్లను ప్రజలకు చూపిస్తాం



కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసింది. హామీల గురించి అడిగితే తాట తీస్తామంటున్నారు. చంద్రబాబు హామీలపై ప్రశ్నించే బాధ్యతను 40 శాతం ఓటుతో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ తీసుకుంది. నాలుక మందంతో కార్యక్రమాలు చేస్తే ప్రజల తరఫున ఉద్యమిస్తాం. చంద్రబాబు, పవన్ మేనిఫెస్టో, బాండ్లను ప్రజలకు చూపిస్తాం. అధికారంలోకి వచ్చి ఏడాదైంది.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఏం చేశారని అడుగుదాం. టక్కుటమార విద్యలతో ప్రజల్ని మోసం చేస్తే కుదరదు. తాట తీస్తాం.. తోకలు కట్ చేస్తాం అంటున్నారు. మీ పార్టీలో ఉన్న వాళ్లకు తోకలున్నాయేమో.. మాకు లేవు. అక్రమ కేసులు పెట్టి, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే వైఎస్సార్ సీపీ పనైపోతుందని కూటమి ప్రభుత్వం అనుకుంటోంది. ఇది ప్రజాస్వామ్యమని గుర్తుపెట్టుకోండి.

– బొత్స సత్యనారాయణ, శాసన మండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్

అందమైన అబద్ధాలే.. బాబు హామీలు



వైఎస్ జగన్‌ను ఓడించడం తన వల్ల కాదని చంద్రబాబు కూటమి కట్టారు. అందమైన అబద్ధాలను హామీలుగా ఇచ్చారు. ఎన్నికల్లో ఆయన అబద్ధమే గెలిచింది. ప్రజలు, ప్రతిపక్షం నోరెత్తకుండా బెదిరింపు ధోరణితో కూటమి ప్రభుత్వం పాలన చేస్తోంది. అందుకే 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పేరుతో వైఎస్సార్ సీపీ ప్రజల్లోకి వెళ్తోంది. క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌లో స్కాన్ చేస్తే టీడీపీ ప్రజాగళం పేరుతో మేనిఫెస్టో వస్తుంది. సూపర్ సిక్స్ ఉమ్మడి మేనిఫెస్టో వస్తుంది. తొలిసారిగా రైతులకు పెట్టుబడి సాయం అందించిన నేత వైఎస్ జగన్. దీనిని చంద్రబాబు కాపీ కొట్టారు. షణ్ముఖ వ్యూహం పేరుతో పవన్ కల్యాణ్, కూటమి నేతలు మరికొన్ని హామీలిచ్చారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, బీసీలకు పెన్షన్ ఇస్తానంటూ నోటికొచ్చిన హామీలు చంద్రబాబు ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలే అమలు చేయడం లేదు. వివక్ష, వేధింపులే ఏకైక అజెండాగా కూటమి పాలన సాగుతోంది.

– కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి

పవన్.. షణ్ముఖ వ్యూహం అమలు చేయాలి



ఎన్నికల ముందు ఇచ్చిన షణ్ముఖ వ్యూహం హామీని పవన్ కల్యాణ్ అమలు చేయాలి. కుమారస్వామి పేరిట విడుదల చేసిన మేనిఫెస్టోలో హామీలను అమలు చేయాలి. కాపులకు ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు ఇస్తానని చెప్పారు. జగన్ ఫైనాన్స్ ఇంజినీరింగ్ వల్ల ఖజానా ఎప్పుడూ నిండుగా ఉండేది. ఎన్నికల్లో 143 హామీలిచ్చిన చంద్రబాబు చేసిన వంచనను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి. ప్రతి వ్యాపారి డొక్కలు ఎండిపోయాయి. ప్రతి హామీ అమలు చేసేంత వరకూ కాలర్ పట్టుకుని లోకేష్‌ను అడుగుతాం. ఆ రోజు కాలర్ పట్టి అడగమని ఆయనే చెప్పారు. మత్స్యకార భరోసాను తొలి ఏడాది ఎగ్గొట్టిన బాబు.. వారికివ్వాల్సిన డీజిల్ రాయితీని ఎత్తేసి మోసం చేశారు.

– దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

కూటమిని నమ్మి మోసపోయిన మహిళలు



మహిళల భద్రతను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. మహిళల భద్రత కోసం నాటి సీఎం వైఎస్ జగన్ ఎన్నో ఆలోచనలు చేశారు. ప్రజలు మోసపోయారనే పరిస్థితి కూటమి పాలనలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని చంద్రబాబు, పవన్‌లను ప్రజలు అడగాలి. ప్రజల తరఫున నిరంతరం పోరాడాల్సిన సమయమిది. ప్రతిపక్షంగా ఆ బాధ్యత మనపై ఎంతో ఉంది. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వకుండా ఏడాది కాలంగా నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన బాబు తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి. ఏడాదిలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అన్నారు. ఒక్కటే ఇచ్చారు. తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టేశారు. ఉచిత బస్సు ఊసే లేదు. వీటన్నింటిపై పోరాడటానికి సిద్ధంగా ఉండాలి. చంద్రబాబుకు నిజాయతీ, నిబద్ధత లేనే లేవు.

– వంగా గీతా విశ్వనాథ్, వైఎస్సార్ సీపీ పిఠాపురం కో ఆర్డినేటర్

హామీలు అమలయ్యే వరకూ ప్రజా పోరాటం



గద్దెనెక్కేందుకు చంద్రబాబు మాయమాటలతో ప్రజలను నమ్మించారు. కౌంటింగ్ అయిన అనంతరం జూన్ 24 నుంచి హామీలన్నింటినీ అమలు చేస్తానన్న బాబు.. గద్దెనెక్కి ఏడాదైనా వాటిని గాలికొదిలేశారు. ఆయన ఇచ్చిన హామీలు అమలయ్యే వరకూ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరఫున పోరాడటానికి క్యాడర్ సిద్ధంగా ఉంది. జగన్ ఇచ్చిన పిలుపు మేరకు చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్తాం.

– దాట్ల సూర్యనారాయణరాజు, పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు

హామీలను గంగలో కలిపేశారు



ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు గంగలో కలిపేశారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకూ ప్రజల తరఫున పోరాడటానికి అందరూ సమన్వయంతో ముందుకు రావాలి. వైఎస్సార్ సీపీ ఓడిపోయిందంటే ఎవరూ నమ్మడం లేదు. జగన్ జనాదరణ కలిగిన నాయకుడు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు కాబట్టే ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. అక్రమ అరెస్టులతో ప్రజా వ్యతిరేకతను నిలువరించడం అసాధ్యం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్

ఆమోదిస్తే బాక్స్ బద్దలే..

- పిఠాపురం మున్సిపాలిటీలో టెండర్ల బాగోతం
- రూ.3 కోట్లతో వివిధ పనులకు అనుమతి
- కూటమి నేతలకు కలిసొచ్చేలా వ్యూహం
- నిబంధనలకు విరుద్ధంగా జిల్లా అధికారి ఆదేశాలు
- వ్యతిరేకిస్తున్న పాలకవర్గం



పిఠాపురం మున్సిపల్ కార్యాలయం

పిఠాపురం: ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాన్ని పక్కన పెట్టేసి, కూటమి నేతలకు కలిసొచ్చేలా జిల్లా అధికారి ఒకరు ఇచ్చిన ఆదేశాలు పిఠాపురం మున్సిపాలిటీలో రచ్చ రేపుతున్నాయి. ఏకంగా రూ.3 కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిపై కూటమి నేతలకు కట్టబెట్టేందుకు జరుగుతున్న ఈ ప్రయత్నాలను పాలకవర్గం అడ్డుకుంటోంది. వివరాలివీ.. పట్టణంలో తాగునీటి సరఫరా, డ్రైన్లు, రోడ్లు, పార్కుల అభివృద్ధికి ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి రూ.3 కోట్లతో అనుమతులు మంజూరు చేశారు. రోడ్ల అభివృద్ధికి రూ.1.48 కోట్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.1.51 కోట్లు కేటాయించారు. ఈ నిధులు తరువాత సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులకు కౌన్సిల్ గత నెలలో ఆమోదం కూడా తెలిపింది.

నిబంధనల ఉల్లంఘన ఇలా..

ప్రస్తుతం ఉన్న ఇంజినీరింగ్ నిబంధనల ప్రకారం రూ.లక్షకు మించి ఏ పని చేపట్టాలన్నా ఈ–ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవాలి. దీనివలన రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లు పోటీ పడి, తక్కువ రేటుకే పనులు చేసే అవకాశం ఉంటుంది. ఫలితంగా ప్రజాధనం మిగిలే అవకాశం ఉంటుంది. కానీ, ఏం ఒత్తిళ్లు వచ్చాయో ఏమో కానీ, మున్సిపల్ పాలకవర్గాన్ని అధికారులు పూర్తిగా పక్కన పెట్టి, కూటమి నేతలకు అనుకూలంగా ఉండేలా ఆఫ్‌లైన్ టెండర్ల విధానాన్ని తెర పైకి తెచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. (కాంట్రాక్టర్లు తమ కొటేషన్లను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేయడం వలన దీనిని బాక్స్ టెండర్లు అని పిలుస్తున్నారు.) ఇందులో భాగంగా ఈ పనులను రూ.5 లక్షల్లోపు ఉండేలా విడగొట్టారు. రోడ్ల పనులు 8, డ్రైన్ పనులు 31 పనులకు బాక్సు టెండర్లు పిలవడానికి ఏర్పాట్లు చేశారు. ఈ పనులను కూటమి నేతలకు కట్టబెట్టేందుకే అధికారులు నిబంధనలు తుంగలో తొక్కారంటూ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల హెచ్చరిక

జిల్లా అధికారి లిఖితపూర్వకంగా ఆదేశించారని పేర్కొంటూ బాక్సు టెండర్ల స్వీకరణకు అనుమతించాలని పిఠాపురం మున్సిపాలిటీ అధికారులు ఆ శాఖ ఉన్నతాధికారులను అభ్యర్థించారు. అయితే, దీనికి ఉన్నతాధికారులు నిరాకరించారని తెలిసింది. టెండర్లలో నిబంధనలు పాటించకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించిన వారు.. ఈ–ప్రొక్యూర్‌మెంటు విధానంలోనే టెండర్లు పిలవాలని ఆదేశించినట్లు తెలిసింది. అయినప్పటికీ, జిల్లా అధికారి ఆదేశాల మేరకు బాక్సు టెండర్ల ద్వారానే పనులు కేటాయించేందుకు మున్సిపల్ అధికారులు చేస్తున్న ప్రయత్నాలపై పాలక వర్గ సభ్యులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రజలు ఎన్నుకున్న పాలక వర్గాన్ని కాదని, కూటమి నేతలకు అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలపై పోరాడాలని వారు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అటు మున్సిపల్ ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు బాక్సు టెండర్లను వ్యతిరేకించడం.. ఇటు జిల్లా అధికారి ఆదేశాల నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోక పిఠాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ వివాదం నేపథ్యంలో తాము ఏ పనీ చేయలేమంటూ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సెలవుపై వెళ్లేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

అదనపు మందుల కౌంటర్ల ఏర్పాటు



వైద్య సేవల నాణ్యతపై రోగులను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ లావణ్య కుమారి

- ల్యాబ్ రిపోర్టులు త్వరితగతిన అందేలా చర్యలు
- జీజీహెచ్‌లో పర్యటించిన సూపరింటెండెంట్

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ క్రైం: 'పెద్దాసుపత్రికి సుస్తీ' శీర్షికన ఈ నెల 25న 'సాక్షి' ప్రచురించిన కథనానికి కాకినాడ జీజీహెచ్ అధికారులు స్పందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి శుక్రవారం ఆసుపత్రిలో పర్యటించారు. మందుల పంపిణీ పేద రోగులకు ప్రహసనంగా మారిందన్న విషయం తెలుసుకున్న ఆమె.. ప్రస్తుతం ఉన్న 8 కౌంటర్లకు అదనంగా మరో 8 కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో మందులు పంపిణీ చేసే కౌంటర్ల సంఖ్య 16కి పెరిగింది. అలాగే, వైద్య పరీక్షల నివేదికలు సకాలంలో అందించేందుకు పాథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాధిపతులతో చర్చించారు. అనంతరం జీజీహెచ్‌లో హిమోఫీలియా, తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు ఐదు పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. వారి సేవలకు పీడియాట్రీషియన్, ఫిజీషియన్‌తో పాటు ఒక స్టాఫ్ నర్సును నియమించారు. వివిధ వార్డుల్లో పర్యటించిన డాక్టర్ లావణ్య కుమారి వైద్య సేవల నాణ్యతను రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డీసీఎస్ ఆర్‌ఎంవో మెహర్ కుమార్ పాల్గొన్నారు.


జిల్లాను సారా రహితం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

కాకినాడ సిటీ: జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమ నిర్వహణకు అధికారులు కృషి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సారా నిర్మూలనకు అధికారులు, సిబ్బంది ఇప్పటి వరకూ చేసిన కృషిపై సమీక్షించారు. సారా ముద్దాయిలను బైండోవర్ చేయాలని, సారా తయారీకి బెల్లం సరఫరా చేసే వ్యాపారులపై గట్టి నిఘా ఉంచాలని, వారిని కూడా బైండోవర్ చేయాలని ఆదేశించారు. సారా నిర్మూలనపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. పలు కేసులలో ముద్దాయిల ప్రవర్తన పరిశీలించి, ఇంకా సారా వ్యాపారం చేస్తుంటే పీడీ యాక్ట్ పెట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్య మురళి, అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎం.కృష్ణకుమారి, ఏఈఎస్ కె.మౌనిక, జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వర్తక రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలు



డీఐసీ జీఎంను సత్కరిస్తున్న ఐసీఏఐ కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వ్యాపార రంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సభ్యురాలు దుర్గాంజలి అన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఐసీఏఐ కాకినాడ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంఎస్‌ఎంఈ మహోత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జీఎం గణపతి మాట్లాడుతూ, ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా ఏర్పాటు చేసే యూనిట్లకు ప్రభుత్వం రాయితీలిస్తుందన్నారు. ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి నారాయణరావు మాట్లాడుతూ, వ్యాపారులతో ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఐసీఏఐ చైర్మన్ తాళ్ళూరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి ఎంఎస్‌ఎంఈపై భారీ స్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసేందుకు, స్పాట్ రుణాలు అందించేందుకు కార్యక్రమం రూపొందిస్తున్నామని చెప్పారు. అనంతరం డీఐసీ జీఎం గణపతిని సత్కరించారు. కార్యక్రమంలో ఐసీఏఐ కాకినాడ బ్రాంచి కార్యదర్శి పాండురంగమూర్తి, ట్రెజరర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వందనానికి వంకలా!

- అంగన్‌వాడీల పిల్లలకు అందని పథకం
- ప్రభుత్వోద్యోగులుగా భావిస్తే ఆ ప్రయోజనాలు తమకూ కల్పించాలని డిమాండ్
- యాప్‌ల యాతనతో పనిభారం పెంచారు
- 42 రోజుల సమ్మె హామీల విస్మరణ
- కూటమి ప్రభుత్వంపై ఆ వర్గం నిప్పులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే ప్రజలకు మేలు చేసేదయ్యుండాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అమలు చేయాలి. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఐదేళ్ల అధికారం ఇస్తే అందులో సామాజిక పింఛన్లు తప్ప మిగిలినవేవీ అమలుకు నోచుకోలేదు. ప్రజల ఒత్తిడి నేపథ్యంలో తల్లికి వందనం ప్రారంభించినప్పటికీ అనేక మంది అర్హులు సాయం అందక గగ్గోలు పెడుతున్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వంటి వారిని విధానపరంగా సంక్షేమ పథకాలకు దూరం పెట్టడంతో చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు అన్యాయం చేయడానికి తామేం పాపం చేశామంటూ ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ పథకాలు చిరుద్యోగులమైన తమకు సైతం అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

సాంకేతికత పేరుతో పనిభారం

అనేక విభాగాల వారికి చేదోడువాదోడుగా ఉండే పనులకు వినియోగించుకోవాల్సిన అంగన్‌వాడీలపై సాంకేతికత పేరుతో కూటమి ప్రభుత్వం భారం మోపుతుంది. పోషకాహారాన్ని అందుకునే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఫేస్ యాప్‌లో నమోదు చేయాల్సి రావడం భారంగా ఉందని, యాప్ యాతనను తొలగించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్‌లను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా 6 నెలలు నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) అందిస్తున్నారు. ఆ రెండు యాప్‌లలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వాటితో పాటు అధికారులు మరో 12 రకాల రికార్డులు రాయిస్తున్నారు. ఏడు నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకుల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారుల ఆధార్ అప్‌డేట్ కాకపోయినా, ఈకేవైసీ కాకపోయినా, ఆధార్ కార్డులో లబ్ధిదారుని ఫోన్ నంబర్ అనుసంధానం కాకపోయినా వివరాలు యాప్‌లో నమోదు కావడంలేదు. అప్‌డేట్ వ్యవహారాలు సచివాలయానికి వెళ్లి సరిచేసుకోవాలని లబ్ధిదారులకు చెప్తున్నప్పటికీ వారు ఖాతరు చేయడంలేదు. దీంతో చేసేది లేక లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అంగన్‌వాడీలు పోషకాహారాన్ని అందించాల్సి వస్తోంది.



ఫిబ్రవరి 17న కపిలేశ్వరపురంలోని ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ఉద్యమాలపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా తాము అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని కూటమి నేతలు అప్పట్లో హామీ ఇచ్చారు. ఏడాది పాలనాకాలం గడిచినా హామీలో ప్రధానమైనదైన రూ.26 వేలకు జీతాలను పెంచాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టారు. ఒక్క రూపాయి కూడా వేతనాన్ని పెంచలేదు. అంగన్‌వాడీ కార్యకర్త చనిపోయినప్పుడు రూ. 20 వేలు మట్టి ఖర్చులు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో రూ.15 వేలు చెల్లించాలంటూ జీఓ జారీ చేశారు. రాష్ట్రంలోని 6,830 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలన్న డిమాండ్‌పైనా ఉలుకూ పలుకూ లేదు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. 2024 జూలై 10న కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వారు ర్యాలీలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10న ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఫిబ్రవరి 17న ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాని ఆందోళనలు చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మార్చి 11న నిర్వహించిన చలో విజయవాడ ఆందోళనలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున బయలుదేరారు. 10న సామర్లకోట, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లు, పలు బస్ స్టేషన్ల వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈనెల 23న ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించిన ధర్నాను నిలువరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర ప్రయత్నం చేసి విఫలమైంది.



వెదురుమూడిలో అంగన్‌వాడీ చిన్నారుల సంసిద్ధత కార్యక్రమంలో.. (ఫైల్)

ఉమ్మడిజిల్లాలో అంగన్‌వాడీలు ఇలా...

కాకినాడ జిల్లాలోని 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,986 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1,05,996 మంది ప్రీస్కూల్ పిల్లలు, 11,610 మంది బాలింతలు, 10,573 మంది గర్భిణులకు అంగన్‌వాడీలు విశేష సేవలందిస్తున్నారు.

- కోనసీమ జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలుండగా 86,296 మంది చిన్నారులు, 15,743 మంది గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నారు.
- తూర్పుగోదావరి జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,536 మెయిన్, 26 మినీ మొత్తం 1,562 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులు సేవలందుకుంటున్నారు.

సంక్షేమ పథకాలకు దూరం చేయొద్దు



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కనీస వేతనాలను చెల్లించకుండా అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీలను దూరం చేస్తోంది. అదే నిర్ణయాన్ని ప్రభుత్వం అమలు చేయదలిస్తే అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న ప్రతి సదుపాయాన్ని కల్పించడంతో పాటు వేతనాలను పెంచాలి. ఆందోళనలు చేస్తున్నప్పుడు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే సహించేది లేదు.

జి.బేబీరాణి, రాష్ట్ర అధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, కాకినాడ

వచ్చే నెల 2న జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని సీఈవో కోరారు.

ఆర్టీసీ ఏటీఎమ్ కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా (కమర్షియల్) కిరణ్ కుమార్ శుక్రవారం రాజమహేంద్రవరంలో బాధ్యతలు చేపట్టారు. తుని డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు డీపీటీవో వైఎస్ఆర్ మూర్తి సారథ్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేసిన మాధవ్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. కాగా.. కిరణ్ కుమార్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని ఆర్టీసీ డిపోలలో పార్శిల్ కార్యాలయాలను పర్యవేక్షించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాలి వాసి మృతి

- కశింకోటలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముందున్న లారీని ఢీకొట్టి ఘటన
- వ్యాన్ డ్రైవర్‌తో సహా మహిళ దుర్మరణం
- మరో మహిళకు గాయాలు



సత్యనారాయణ (ఫైల్)

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జమాదులపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్తున్న కంటైనర్‌ను బొలేరో వ్యాన్ ఢీకొంది. దాంతో వ్యాన్ డ్రైవర్ సహా ఒక మహిళ దుర్మరణం పాలయ్యారు. మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన పూల వ్యాపారి కన్నూరు లక్ష్మి(40)తో పాటు మరో మహిళ తూర్పు గోదావరి జిల్లా కడియం వద్ద పూలు కొనుగోలు చేసి గాజువాకలో విక్రయానికి వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఈ వ్యాన్ అదే మార్గంలో ముందు వెళ్తూ అకస్మాత్తుగా ఆగిన కంటైనర్ లారీని బలంగా ఢీకొంది. దీంతో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పి.సత్యనారాయణ (25), పూల వ్యాపారి లక్ష్మి(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లి మండలం కోడూరుకు చెందిన పూల వ్యాపారి ఎస్.వరలక్ష్మి తీవ్రంగా గాయపడింది. వెంటనే సీఐ స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావులతోపాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వరలక్ష్మిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహాపై విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.



కంటైనర్ లారీని ఢీకొన్న పూల లోడు వ్యాన్



వ్యాన్‌లో చిక్కుకున్న సత్యనారాయణ మృతదేహం

కేబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాలు..

ఈ ఘటనలో వ్యాన్ క్యాబిన్ నుజ్జవడంతో అందులో డ్రైవర్, పక్క సీటులో కూర్చున్న లక్ష్మి మృత్యువాత పడ్డారు. పోలీసులు అతి కష్టం మీద వారిని బయటకు తీసి అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

23 కిలోల సరకు, కారు స్వాధీనం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామ పరిధిలోని వసంత నగర్ వద్ద గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను సర్పవరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల మేరకు ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో నిందితులు కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన చల్లా నాగ శివ మణికంఠ, మధురానగర్‌కు చెందిన మద్దాల ఉదయ్‌కుమార్, కాకినాడ రూరల్ గైగోలుపాడుకు చెందిన ఏనుగుపల్లి రాజులను పట్టుకుని వారి నుంచి 23కిలోల గంజాయి, స్విఫ్ట్ కారు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. దారకొండ నుంచి గంజాయిని విక్రయానికి తీసుకువచ్చినట్టు నిందితులు అంగీకరించారని సీఐ తెలిపారు. నిందితులకు నేర చరిత్ర ఉందని గతంలో హత్య, దొంగతనాలు, ఇంటి చోరీలు, ఎన్‌డీపీఎస్ కేసులు కాకినాడ వన్ టౌన్, సర్పవరం, ఇంద్రపాలెం, పెద్దాపురం, తుని, అన్నవరం, కోటనందూరు, రాజానగరం, ద్రాక్షారామం పోలీసు స్టేషన్లలో ఉన్నాయన్నారు. వీరి క్రిమినల్ రికార్డుల పరిశీలనలో ఆర్గనైజ్డ్ క్రైమ్‌లో ఉండి నేరాలు చేస్తున్నట్టు స్పష్టమవుతోందని, వీరిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 111(2)(బి)ను చేర్చామని తెలిపారు. నిందుతులు ముగ్గురిని న్యాయ స్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.